www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 23 సెప్టెంబర్ 2024

5

అన్నమయ్య

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల్లో సాధించిన విజయాలు, ప్రగతిని జిల్లా ప్రజలకు తెలియచేజేసేందుకు 'ఇది మంచి ప్రభుత్వం', అలాగే స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ -2047 కార్యక్రమాల్లో భాగంగా జిల్లా అంతటా గ్రామసభలు నిర్వహిస్తున్న సందర్భంగా 23న జరగాల్సిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని తాత్కాలిక రద్దు చేశామని తెలిపారు. జిల్లా అధికారులు, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, పంచాయతీ సెక్రెటరీలు, ఇతర అధికారులు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించగలరని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- దీపావళి నుంచి మూడు పథకాలు అమలు
- మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం
- రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

పేదల సంక్షేమమే తమ కర్తవ్యంగా అర్హులందరికీ పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తామని రాష్ట్ర రవాణా, యువజన , క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎవరు చేయని విధంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజులలో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల నుంచి ఇది మంచి ప్రభుత్వం అని ఒక గుర్తింపు తీసుకుచ్చిందన్నారు. రాబోయే రోజులలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలలో భాగంగా వచ్చే దీపావళికి అర్హులైన ప్రతి ఇంటికి మూడు సిలిండర్లు ఇచ్చే కార్యక్రమాన్ని అమలు చేస్తామని చెప్పారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి త్వరలో విధి విధానాలు రూపొందించి సౌకర్యాన్ని త్వరలో కల్పిస్తామని పేర్కొన్నారు. గతంలో పెన్షన్లు కొందరికి మాత్రమే ఇచ్చే వారని, నేడు కుల మత ప్రాంత భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద ప్రజలు ఎవరు ఆకలితో పస్తులు ఉండకూడదనే ముఖ్య ఉద్దేశంతో అన్న క్యాంటీన్లను ప్రారంభించారన్నారు. ప్రతి పేదవాడు మూడు పూటలా భోజనం చేసి సుఖ సంతోషాలతో జీవిస్తారన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా ఇకనుంచి రాష్ట్రంలో ఎక్కడ కూడా ఆకలి కేకలు ఉండవన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న కోట్లాదిమంది రైతులు ఉరి వేసుకునే విధంగా తెచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దుచేసి రైతులను ఆదుకున్నారని చెప్పారు. డ్వాక్రా మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సంఘాలను బలోపేతం చేసేందుకు వారికి రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన నూతన జిల్లాలలో ప్రతి శాఖకు ప్రభుత్వ భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం నూతన జిల్లాలలో ప్రభుత్వ భవనాలు లేక ఉద్యోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొత్త జిల్లాలలో అన్ని శాఖలకు ప్రభుత్వ భవనాలు నిర్మిస్తారన్నారు. మన ప్రాంతంలో వర్షపాతం తక్కువ పడడంతో నీటి మట్టం తగ్గిపోయి ఎన్ని బోర్లు వేసినా నీరు పడడం లేదన్నారు. దీంతో గ్రామాలలో నీటి సమస్య తీర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఇకనుంచి నీటి సమస్య రాకుండా రాబోయే ఐదు సంవత్సరాలలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాలలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో ఎన్టీఆర్ కాలనీలు నిర్మిస్తామన్నారు. మన ప్రాంతవాసులు చాలామంది జీవనాధారం కోసం కువైట్, సౌదీ లాంటి ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడ నాన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాంటి వారి సమస్యలన్నీ పరిష్కరించేందుకు మన ప్రాంతంలో వివిధ ఫ్యాక్టరీలు పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే ఐదు సంవత్సరాలలో రాయచోటి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరు తమకు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం

మండలంలోని దిగువ అబ్బవరం గ్రామంలో నీటి సమస్య అధికంగా ఉందని మహిళలు మంత్రి దృష్టికి తెచ్చారు. నీటి సమస్యపై వెంటనే స్పందించిన ఆయన అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి దిగువ అబ్బవరం గ్రామంలో నీటి ఎద్దడి అధికంగా ఉందని ఈ సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తా

లక్కిరెడ్డిపల్లి : మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు ఆది వారం బి ఎర్రగుడి పంచాయతీలోని కాపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాలలో సుడిగాలి పర్యటన చేసి ప్రజల సమస్యలపై ఆరా తీశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి మండలానికి ప్రత్యేక నిధులు కేటాయించి వఅన్ని విధాల అభివృద్ధి చేసా _మన్నారు. పాలెం గొల్లపల్లి బీరగుడి చెంచలపల్లి గ్రామాలకు రోడ్లు ఏర్పాటు చేస్తానని, తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపడ తామన్నారు. ప్రజలు సమస్యలు తమ దృష్టికి తేవాలని ఆయన అన్నారు. ఈ ఏడాది మండలంలో కరువు నెలకొందని, ప్రత్యేక చర్యలు చేపట్టి రైతులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, మండల యువ నాయకుడు, మాజీ ఎంపిటిసి యనమల మదన మోహన్, షేక్ ఆరిఫ్ వెంకటరమణ, జెకె రెడ్డి దళిత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు పాల్గొన్నారు

అలజడి సృష్టించిన ఎటిఎంల చోరీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా మూడు చోట్ల ఎటిఎంలను దొంగలు పగలగొట్టి నగదు దోచుకు వెళ్లడం అలజడి సృష్టించింది. ఆదివారం తెల్ల వారుజామున ఈ సంఘటన చోటుచేసుకుంది. కడప నగరంలోని ద్వారకనగర్ ఎటిఎం వద్ద రూ.6,19300 లక్షల నగదు దోచుకున్నారు. ఒంటిమిట్ట ఎటిఎంలో రూ.37 లక్షల నగదు ఎత్తుకు వెళ్లారు. ఎల్ఐసి సమీపంలోని విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్ద ఎటీమ్‌ను చోరీ చేయడానికి దొంగలు విశ్వ ప్రయత్నం చేశారు. అయితే సైరాన్ మోగడంతో వారు పరారయ్యారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు నిఘా ఉన్నా, రాత్రులు గస్తీ తిరుగుతున్నా దొంగతనాలు చోటు చేసుకోవడం పట్ల ప్రజల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గస్తీ మరింత పెంచాలని కోరుతున్నారు.

అర్థాంతరంగా ఆగిన లిఫ్ట్ పనులు

- 2008 నుంచి పనులు సాగతీత
- వెయ్యి ఎకరాలకు అందని సాగునీరు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

మోటార్ల ఏర్పాటుకు నిర్మించిన గది

అసంపూర్తిగా నిలిచిపోయిన పంప్ హౌస్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్ రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఆధునీకరణ పనులు 2009 సంవత్సరంలో రత్న కన్స్ట్రక్షన్ కంపెనీకి అప్పగించారు. కంపెనీ లాభసాటికి ఉన్న పనులు మాత్రమే చేసి మిగిలినవి అర్థంతరంగా వదిలేశారు. అప్పటి నుంచి ప్రభుత్వాలు మారుతున్నా పనులు మాత్రం పూర్తిగాకపోవడంతో రైతులు నేటికీ సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా 93 - ఏ ప్యాకేజ్‌లో భాగంగా పులివెందుల బ్రాంచ్ కెనాల్ వెంకటంపల్లి సమీపంలో పంపు హౌస్ ఏర్పాటు చేసి అక్కడ నుంచి నీటిని లిఫ్ట్ చేసి గురజాలలోని 1000 ఎకరాలకు సాగునీటి అందించాలని దాదాపు రూ. 4 కోట్ల వ్యయంతో పనులకు శ్రీకారం చుట్టారు. రెండు 60 హెచ్‌పి సామర్థ్యం కలిగిన భారీ మోటార్లను అమర్చి పైపులైన్ ద్వారా ఒక కిలోమీటర్ అనంతరం మినీ ట్యాంకుకు నీటిని పంపింగ్ చేసి అక్కడి నుంచి రైతుల పొలాలకు నీటిని సరఫరా చేస్తారు. అయితే పంపు హౌస్ నిర్మాణం 50 శాతం మాత్రమే పూర్తయింది. విద్యుత్‌కు సంబంధించి 24 గంటల నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు ట్రాన్స్ ఫార్మర్, విద్యుత్తు లైను సబ్ స్టేషన్ నుంచి పంప్ హౌస్ వరకు ఏర్పాటు చేశారు. మిగిలిన పనులు నేటికీ నోచుకోలేదు. గతంలో నీటి పంపింగ్‌కు సంబంధించి పైపులు ఏర్పాటు చేశారు. తరువాత కాంట్రాక్టర్ తిరిగి వాటిని ఎత్తుకు వెళ్లారు. ఆ పనులను పూర్తి చేస్తే 1000 ఎకరాలకు సాగునీరు సమృద్ధిగా అందించే అవకాశం ఉంది.

కృష్ణా జలాలతో నిరంతరం కాలువల్లో నీరు..

పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పిబిసి) పరిధిలో కాలువలకు ఇటీవల కాలంలో కృష్ణా జలాలు రావడంతో నీరు రైతుల అవసరాల మేరకు నిరంతరాయంగా విడుదల చేస్తున్నారు. గతంలో తుంగభద్ర నీరు అరకొరగా వస్తుండడంతో కాలువలకు సక్రమంగా నీరు వచ్చేవి కావు. ఇటీవల గండికోట ప్రాజెక్టు నుంచి లిఫ్ట్ ద్వారా చిత్రావతి రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 10 టిఎంసిలు కాగా 9.5 టిఎంసిల వరకు నీటిని నిల్వ చేస్తున్నారు. దీంతో పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఈ నేపథ్యంలో లిఫ్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తే మరో వెయ్యి ఎకరాలకు సాగునీరును విడుదల చేసే అవకాశం ఉంది. ఆ దిశగా పాలకులు అధికారులు చర్యలు తీసుకుని పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

లిఫ్ట్ పనులు పూర్తిచేస్తే ఎంతో ఉపయోగం..

అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకుని లిఫ్ట్ పనులు త్వరగా పూర్తిచేస్తే ఉప యోగకరంగా ఉంటుంది. దాదాపు 1000 ఎకరాలకు సాగు నీరు సమృద్ధిగా వచ్చే అవ కాశం ఉంది. కావున అధికారులు వెంటనే చర్యలు తీసుకుని పెండింగ్ పనులను పూర్తి చేయాలి.

-మురళీమోహన్, రైతు, గురజాల.

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని 93- ఏ ప్యాకేజీ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న లిఫ్ట్ పనుల స్టేటస్‌ను ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఈ లిఫ్ట్ పనులు దాదాపు 50 శాతం వరకు పూర్తయ్యాయి. మిగిలిన పనులు సైతం త్వరలోనే పూర్తి చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్త ప్రతిపాదనలు తయారు చేశాం.

-రాజశేఖర్, ఇఇ, పిబిసి,పులివెందుల.

పారదర్శకతకు పెద్దపీట

- నర్సింగ్ ప్రమోషన్లపై నిశిత పరిశీలన
- త్వరలో పెండింగ్ ప్రమోషన్లపై నిర్ణయం
- రీజినల్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు వెల్లడి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

నర్సింగ్ నియామకాల్లో పార దర్శకతకు పెద్దపీట వేస్తున్నాం. స్టాఫ్‌నర్సులు, ఎంపిహెచ్‌ఓ వంటి రిక్రూట్‌మెంట్, ప్రమోషన్ల అంశాల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేదు. రీజియన్ పరిధిలో వైద్య సేవల్లో మెరుగుదలకు కృషి చేస్తున్నాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్యసేవలతో ముందుకెళ్లే విధంగా నియామకాలు చేపడుతున్నాం. భవిష్యత్ రిక్రూట్‌మెంట్‌ల్లో దరఖాస్తు దారుల సర్టిఫికెట్లను యూనివర్శిటీ ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం పారదర్శకంగా నియా మకాలు చేపడతామని పేర్కొంటున్న రీజినల్ డైరెక్టర్ కె.శ్రీనివాసులుతో ముఖాముఖి...

జోన్-4 పరిధిలోని విభాగాలు, ఉద్యోగులు సంఖ్య ఎంత?

జోన్-4 పరిధిలో కడప, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో 3, 800 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో ఎంపిహెచ్ఇఒ ఎంపి హెచ్ఎస్, హెచ్ఇసి, ఎంఎల్‌హెచ్‌పి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, తాజాగా ఫార్మసిస్టులను కూడా కలపడంతో విస్తృతి పెరిగింది. వీరందరి సర్వీసులు, రిక్రూట్‌మెంట్లు, బదిలీలు, వైద్య ఆరోగ్యానికి సంబంధిత స్కీముల అమలు తీరును పరిశీలన చేయాల్సి ఉంటుంది.

స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుంది?

స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ ప్రక్రియ లేదు. డిసెంబర్ మూడవ వారంలో సుమారు 40 నుంచి 50 పెండింగ్ స్టాఫ్‌నర్స్, ఇతర పోస్టుల భర్తీ నిర్వహించే అవకాశం ఉంది. వీటిని సైతం రాష్ట్రప్రభు త్వానికి ప్రతిపాదించిన అనంతరం చేపడతాం.

నకిలీ సర్టిఫికెట్ల బెడద నివారణ చర్యలేమిటి?

జోన్-4లో నర్సింగ్ నియామకాల్లో నకిలీ సర్టిఫికెట్ల బెడద నివారణపై సీరియస్‌గా దృష్టి సారించాం. దరఖాస్తుల స్క్రీనింగ్ అనంతరం నిర్వ హించనున్న కౌన్సెలింగ్‌లో అర్హత సాధించిన అభ్యర్థి సర్టిఫికెట్లను హెల్త్ యూనివర్శిటీ ఉన్నతా ధికారుల సహకారం తీసుకుంటాం. యూనివర్శిటీ అధికారులు సర్టిఫై చేసిన అనంతరం నియామకాలు చేపడతాం. దీంతో నియామకాల్లో పారదర్శకతను తీసుకొస్తాం.

దీర్ఘకాలిక రోగుల వైద్యసేవలను వివరించండి?

జ: క్రానిక్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం ఉంది. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి జీవితాల్ని అతి కష్టంగా లాగుకొస్తున్న వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవడంలో భాగ ంగా నియామకాలు చేపడతాం. ప్రతి పిహెచ్‌సి పరిధిలో 172 రకా ల మందులను అందుబాటులో ఉంచుతాం. గుండె సంబంధిత వ్యాధుల మందులను సైతం అవసరమైన మేరకు అందుబాటులో ఉంచే ప్రయత్నం జరుగుతోంది.

'ఉర్దూ' సమస్యల పరిష్కారానికి కృషి : 'రూట'

సమావేశంలో మాట్లాడుతున్న రూట నాయకులు మహమ్మద్ ఆయూబ్

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉర్దూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ , రాష్ట్ర కో - ఆర్డినేటర్ ముహమ్మద్ అయూబ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రూట జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సబాతుర్ రెహ్మాన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడుతూ గతం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1997లో ఉర్దూ స్పెషల్ డిఎస్సి నిర్వహించి ఉర్దూ విద్యా వ్యవస్థకు ఊపిరి పోశారని, 2024లో ఉర్దూ స్పెషల్ డిఎస్‌సి నిర్వహించి రాష్ట్రంలోని ప్రతి ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. రూట రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ముహమ్మద్ ఆలీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2001 సంవత్సరంలో రోష్నీ పథకం ప్రారంభించి తద్వారా రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించి ప్రతి ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు రెండు సెకండరి గ్రేడ్ టీచర్ల పోస్టులు మంజూరు చేశారన్నారు. ఉర్దూ పాఠశాలల మనుగడకు పునాది వేశారని, రోష్నీ పథకం పునఃప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా సర్వే నిర్వహించి నూతనంగా కనీసం 500 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించాలని కోరారు. రూట రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసదుల్లా బాష మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 55000 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో ఒక్కటి కూడా ఉర్దూ అంగన్వాడీ లేకపోవడం ఉర్దూ విద్యావ్యవస్థ మనుగడకే ప్రశ్నార్థకంగా మారిందని , కనీసం 5000 ఉర్దూ అంగన్వాడీ కేంద్రాలు స్థాపించాలని తద్వారా ముస్లిం మైనారిటీ పసిపిల్లలకు తమ మాతృభాష ఉర్దూలో చదివే భాగ్యం కల్పించి ఉర్దూ నిరుద్యోగ మైనారిటీ యువతులకు అంగన్వాడీ టీచర్లుగా, హెల్పర్లుగా ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముహమ్మద్ హాషిం, జాఫరుద్దిన్, జిల్లా నాయకులు హుమాయుద్దీన్, ఇంరోజ్ అలిఖాన్ పాల్గొన్నారు.

నేడు మదనపల్లెకు మంత్రి 'నిమ్మల' రాక

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్ చినబాబు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హంద్రీ-నీవా కాలువ పరిశీలనలో భాగంగా సోమవారం మదనపల్లికి రానున్నారని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం నీరుగట్టువారి పల్లెలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మంత్రి పర్యటన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ రాయలసీమ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హంద్రీ-నీవా స్థితిగతులు పరిశీలించాలని మంత్రి రామా నాయుడును ఆదేశించారన్నారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా డోన్ నుంచి ఆయన కాలువను పరిశీలిస్తూ ఆదివారం రాత్రి హార్సిలీహిల్స్‌లో బస చేసి సోమవారం ఉదయం 8 గంటలకు కురబలకోట మండలం దొమ్మన్నబావి వద్ద హంద్రీనీవా కాలువ పరిశీలిస్తారని చెప్పారు. 9-10 గంటల మధ్యలో మదనపల్లి చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పరిశీలన ఉంటుందన్నారు. చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ పూర్తి కాకపోవడానికి వైసిపి ప్రభుత్వమే కారణమని, చిప్పిలి స్టోరేజ్ నీళ్లను పుంగనూరుకి మళ్లించిన పాపం పెద్దిరెడ్డిదేనని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సూపర్ సిక్స్‌లో సగం పథకాలను చిత్తశుద్ధితో అమలు చేశామన్నారు. త్వరలోనే అన్ని పథకాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. తిరుమల పవిత్రతకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మచ్చ తీసుకొచ్చారని, శ్రీవారి ప్రసాదంలో జంతువులు కొవ్వును కలిపి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పార్లమెంట్ జనరల్ సెక్రటరీ దొరస్వామి నాయుడు, రాటకొండ సోమశేఖర్, రేగడి ప్రసాద్ కుమార్, మహబూబ్ ఖాన్, మోడెం నాగరాజు, బండి అమర, శ్రీరాములు, హోటల్ శంకర, రెడ్డి ప్రసాద్, మల్లికార్జున, అమ్మినేని కృష్ణమ నాయుడు, సంద్ర రెడ్డప్ప నాయుడు, పసుపులేటి వరప్రసాద్, పోలశెట్టి వెంకటరమణ మరియు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాస్కామ్‌తో 'మిట్స్' ఒప్పందం

ఒప్పంద పత్రాలు చూపుతున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లెలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల ద్వారా నైపుణ్యాన్ని పెంచడం లక్ష్యంగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు. నిరంతర, స్వీయ-వేగవంతమైన అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి, పాల్గొనేవారు కొత్త, పరిశ్రమ-సంబంధిత నైపుణ్యాలను పొందేందుకు వీలుగా ఈ ఒఎంయు రూపొందించారని తెలిపారు. ఐటి , సాఫ్ట్‌వేర్ పరిశ్రమ అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యం సెట్‌లను మెరుగుపరచడానికి ఈ సహకారం అందిస్తారని భావిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో ఉచిత, డీప్ స్కిల్లింగ్ కోర్సులతో సహా స్వల్పకాలిక అవగాహన, నైపుణ్య సామర్థ్య అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడానికి ఒప్పందం ఉపయోగపడుతుందని అన్నారు. డేటా సైంటిస్ట్, బిజినెస్ ఇంటెలిజెన్స్ అనలిస్ట్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనలిస్ట్, మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్ వంటి కీలకమైన డిజిటల్ టెక్ పాత్రలలో తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నందున, నాస్కామ్ ధృవీకరణలు విద్యార్థులకు చాలా విలువైనవిగా ఉంటాయి అని అన్నారు.

50 మంది తల్లులకు బేబీ కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె మానవత సంస్థ ఆధ్వర్యంలో విశ్రాంత ప్రధా నోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, ఆయన సతీమణి స్వర్ణ కుమారి, కుమారుడు మహేష్ కుమార్ రెడ్డి , కోడలు మన్విత ల ఆర్థిక సహాయంతో స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 50 మంది తల్లులకు ఆదివారం బేబీ కిట్స్, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవత అధ్యక్షులు భాస్కర రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణప్ప, చైర్మన్ గురుప్రసాద్ మాట్లాడుతూ గోపాల్‌రెడ్డి కుటుంబం ఇలాంటి మంచి కార్యక్రమాలు అనేకం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ ప్రభాకర్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎస్‌టియు ప్రధాన కార్యదర్శి పోకల మధుసూధన,డైరెక్టర్స్ నారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు బి.టి.నరసింహులు, సుధాకర్ రెడ్డి,శంకరప్ప నాయుడు, చలపతి, నాగేశ్వరరావు, రాధికా బాయి ,దాతలు గోపాల్ రెడ్డి , స్వర్ణ కుమారి పాల్గొన్నారు.

బేబీ కిట్స్‌తో మానవత సభ్యులు, దాతలు

నగదును అందిస్తున్న లక్ష్మీనారాయణ

ఆలయానికి రూ.20 వేలు వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లె అరుంధతివాడ గ్రామంలో కలిసి ఉన్న మాతమ్మ దేవాలయానికి రొంపిచర్ల నాగేశ్వరావు, మల్లికార్జున, గౌరీశంకర్ జ్ఞాపకార్థంగా రొంపిచర్ల లక్ష్మీనారాయణ భార్య అనిత దంపతులు ఆదివారం అరుంధతివాడ గ్రామ ప్రజల సమక్షంలో 20వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రొంపిచర్ల లక్ష్మీనారాయణ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధి సహకరించడం అభినందనీయమని అన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సహకారంతో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా డిప్యూటీ మేనేజర్ శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకులు విద్యార్థులకు ఉన్నత విద్యకు రుణ సదుపాయం కల్పిస్తున్నదని చిన్నప్పటినుంచే విద్యార్థులు బ్యాంకు ఖాతాలు తెరిచి కొంత డబ్బును బ్యాంకులో దాచుకొని భవిష్యత్తులో విద్య కార్యక్రమాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి బ్యాంకు ఖాతాను కలిగి ఉండవలెనని పొదుపు పాటించవలెనని విద్యార్థులకు సూచనలు సలహాలు తెలిపారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రాజయ్య, వెంకటరత్నం, సుకన్య, ఇంద్రావతి, చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, కిషోర్, వెంకటేశ్వర్లు, పీడీ బాలశేఖర్ పాల్గొన్నారు.

నేడు గువ్వలచెరువుకు మంత్రి రాక

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గువ్వల చెరువుకు సోమవారం రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖల మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి వస్తున్నట్లు మంత్రి పిఆర్ఓ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని మండలాల వారిగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా రామాపురం మండలంలోని గువ్వల చెరువులో మన మంచి ప్రభుత్వంలో భాగంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బండపల్లి బోర్డేట్ సమీపంలోని కంబాలయిని గుట్ట పైగల మహా విష్ణు గుడి వరకు రూ.70 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు ప్రారంభించిన అనంతరం గువ్వల చెరువు లో నిర్వహించే ప్రజా దర్బార్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా లోని అన్ని శాఖల అధికారులు హాజరవుతారని ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించు కోవాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ఎన్‌వి కళ్యాణమండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ వారి వారి శాఖల వారీగా ప్రగతి గ్రామస్థాయిలో వివరించవలసిన పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది మండల అధికారులు సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

ఎఐ రమణ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-రామసముద్రం

రామసముద్రం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎఇగా పని చేస్తున్న రమణ ఆదివారం ఉదయం ఆయన ఆకస్మిక మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న కార్యాలయ సిబ్బంది ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సిబ్బంది నివాళులు అర్పించారు. ప్రమోషన్‌లో భాగంగా ఎంపిడిఒగా త్వరలో బాధ్యతలు చేపట్టనుండగా దురదృష్టవశాత్తు హఠాత్తుగా చెందారని ఆవేదన వ్యక్తం చేశారు.

మోడీ, చంద్రబాబు పాలనలో పెరిగిన ధరలు

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెరిగి పోయాయని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచడం ద్వారా వంట నూనె ధరలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. పామాయిల్ మీద దిగుమతి సుంకాన్ని 27.5 శాతం విధించడం ద్వారా ఒక లీటరుపై అదనంగా రూ.20 పెరిగిందన్నారు. సన్‌ఫ్లవర్‌పై దిగుమతి సుంకాన్ని 13 శాతం నుండి 35.5 శాతానికి పెంచడం ద్వారా ఒక్క లీటర్‌పై రూ.39 పెరిగిందన్నారు. కందిపప్పు ధర కొండెక్కి కూర్చుందని పేర్కొన్నారు. కిలో కంది రూ.160 నుంచి రూ.173కు పెరిగిందని తెలిపారు. ఎండు మిర్చి కిలో ధర రూ.180 నుంచి రూ.220, వెల్లుల్లి రూ.240 నుంచి రూ.400కు, చింతపండు రూ.110 నుంచి రూ.140కు పెరిగినట్లు చెప్పారు. వంటింటి బడ్జెట్ ఒక్కసారిగా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు విలవిలలాడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వికసిత భారత్ అంటారా లేక విషాద భారత్ అంటారో ప్రధాని మోడీ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు కూడా దీన్ని మంచి ప్రభుత్వం అంటారా లేక ముంచే ప్రభుత్వం అంటారో సమాధానం చెప్పాలని కోరారు. ఇప్పటికైనా ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు ఇద్దరూ వట్టి మాటలు కట్టిపెట్టి ధరల నియంత్రణ మీద దృష్టి పెట్టాలని కోరారు.

బాబోయ్.. ఇసుక దొంగలున్నారు జాగ్రత్త..!

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో ఇంటి నిర్మాణం కోసం తోలుకున్న ఇసుకను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలిస్తున్నారు. దీంతో ఇంటి నిర్మాణ యాజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎద్దుల బండ్లు ద్వారా ఇంటి నిర్మాణాల కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ఇసుకను ఇంటి యాజమానులు తోలుకున్నారు. దీన్ని ఆసరా చేసుకొని కొందరు దుండగులు రాత్రి సమయంలో ఇంటి నిర్మాణం వద్ద ఉన్న ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. పగలు వచ్చి చూస్తే ఇసుక లేకపోవడంతో కూలీలు వెనుదిరుగాల్సి వస్తోంది. ఇంటి నిర్మాణం చేపట్టిన యాజమానులు భయాందోళనకు గురవుతున్నారు. రాయచోటి-పులివెందుల బైపాస్ రోడ్డులో మౌలా అనే వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం నాలుగు ట్రాక్టర్ల ఇసుకను తోలించుకున్నాడు. ఆ ఇంటి వద్ద ఉన్న ఇసుకను ఆదివారం తెల్లవారుజామును గుర్తు తెలియని వ్యక్తులు పూర్తిగా ట్రాక్టర్ల ద్వారా తరలించినట్లు బాధితుడు మౌలా వాపోయాడు. ఇసుక దొంగలించడం అనేది గతంలో ఎన్నడూ జరగలేదని, ఈ పరిస్థితి కొద్దిరోజుల నుంచి జరుగుతోందని వాపోతున్నారు. వేంపల్లె చరిత్రలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో పాపాఘ్ని నది నుండి ఇసుకను తరలించకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ నేపధ్యంలో ఇంటి ముందు ఉన్న ఇసుకను తరలించేందుకు గుర్తు తెలియని వ్యక్తులు సిద్ధపడుతున్నారు. పోలీసులు గస్తీ పెంచి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ఇంటి నిర్మాణ యజమానులు కోరుతున్నారు.

సిఎం సహాయ నిధికి విరాళాలివ్వడం అభినందనీయం

ప్రజాశక్తి - సింహాద్రిపురం: ముఖ్యమంత్రి సహాయ నిధికి పలువురు ఆర్థికసాయం అందించడం అభినందనీయమని ఎమ్మెల్సీ బిటెక్ రవి, టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో పులివెందుల పట్టణానికి చెందిన ఒంటెద్దు మల్లికార్జున రెడ్డి రూ.50 వేలు, ఒంటెద్దు చంద్రశేఖర్‌రెడ్డి రూ.50,116 విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వరద సహాయ కార్యక్రమాల్లో ప్రభుత్వానికి అండగా నిలుస్తూ విరాళాలివ్వడం హర్షణీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు దాతలు పెద్ద సంఖ్యలో ముందుకొచ్చి ప్రభుత్వానికి అండగా నిలవాలని వారు కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలికిరి

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచి వంద రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహి స్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీలేరు నియోజవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ రెడ్డి ఆదివారం కలికిరి మేజర్ పంచాయతీ, గుట్ట పాలెం పంచాయితీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలపై ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల కరపత్రాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి పాలనలో యువతకు ఉపాధి అవకాశాలు కనిపిస్తామని, ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి మొండి చేయి చూపించారని అన్నారు. రీ సర్వేల పేరుతో రైతులందరినీ ఇబ్బందికి గురి చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హామీల్లో భాగంగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేశామని, వృద్ధాప్య పింఛన్లు రూ.4వేలు చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. వచ్చే దీపావళి పండుగ నుండి మూడు గ్యాస్ సిలిండర్లు మహిళలకు ఉచితంగా పంపిణీ చేస్తారని త్వరితగతిన అమలు చేయడానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు ప్రారంభించారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు మురుకునీటి కాలువలు, సిసి రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు వంటి సమస్యలు ఆయన వద్ద లేవనెత్తారు. ఈ సందర్భంగా ఆయన వీలైనంత త్వరగా సమస్యలన్నీ పరిష్కరించడానికి కృషి చేస్తామని, సంబంధిత అధికారులు అందరూ రెండు మూడు రోజుల్లో బాధితుల దగ్గరికి వెళ్లి వారి సమస్యలను తీసుకోవాలనిఆదేశించారు. కొత్తపల్లి వద్ద ఉన్న కాలనీ మదనపల్లి రోడ్డులో సిఎల్‌ఆర్ బిల్డింగ్ వెనకవైపు ఉన్న లేఅవుట్‌ను పరిశీలించి ఖాళీ ఉన్న ప్లాట్ల వివరాలు ఇవ్వాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. కలికిరిలో ఉన్న ఎల్లమ్మ దేవాలయం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, శ్రీ కళామృత్యుంజయ ప్రసన్న పార్వతీ సమేత సోమే శ్వరస్వామి దేవాలయాల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఎండోమెంట్ భూము లు పరిశీలి ంచి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల టిడిపి ఇన్ ఛార్జి నిజాముద్దీన్, మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎల్లయ్య, నల్లారి లక్ష్మీకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, నాయకులు యోగేష్‌రెడ్డి, గాయత్రిరెడ్డి, సతీష్‌రెడ్డి, గుట్టుపాలెం మాజీ సర్పంచ్ వెంకటరమణరెడ్డి, జనార్దన్ గౌడ్, సర్పంచ్ రెడ్డి రామ్ పాల్గొ న్నారు. **వీరబల్లి :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాజంపేట ఇన్‌ఛార్జి సుగవాసి బాల సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని పెద్దివీడు పంచాయతీ జడ్‌పి హైస్కూల్‌లో మైదానంలో టిడిపి నాయకులు తాటి గుంట్ల శ్రీధర్‌రెడ్డి, తాటి గుంట్ల సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. రాజంపేట ఇన్చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ చంద్రబాబు వందరోజుల పాలనలో పింఛన్ల పెంపు, మెగా డిఎస్‌సి, అన్న క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు తదితర కార్యక్రమాలు చేపట్టడంతో ప్రజలే ఇది మంచి ప్రభుత్వం అంటున్నారని అన్నారు. పెద్దివీడు పంచా యతీల్లో పెద్ద హరిజనవాడ, గ్రంధి వాండ్లపల్లి, సంఘంవారిపల్లి, మాలపల్లి ప్రజలు తాగునీటి సమస్య ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన రోడ్ల మడుగు తాగునీరు వచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంతవరకు ప్రజలకు తాగు నీటి సమస్య రాకుండా టిడిపి నాయకులు ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీరు అందిం చాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు శ్రీధర్ రెడ్డి, సురేంద్రరెడ్డి, సిఐ వరప్ర సాద్, సర్పంచ్ నేతి ఆంజనేయులు, కల్లూరి రామ్మోహన్ రెడ్డి, పద్మనాభరెడ్డి, సర్పంచ్ నాగార్జునచారి, టిడిపి నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా కూటమి ప్రభు త్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరు స్తుందని తెలుగు యువత మండల అధ్యక్షులు చినబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాల కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగాఇది మంచి ప్రభుత్వం కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నాదని అన్నారు. కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి రాజేష్, ఇంజి నీరింగ్ అసిస్టెంట్ పురుషోత్తం, టిడిపి యువ నాయకులు విజయ్, చిన్న రెడ్డప్ప, ప్రశాంత్, అధికారులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు. **టి.సుండుపల్లి:** కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా రాజంపేట అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గ జనసేనపార్టీ నాయకులు రామ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టిడిపి, జనసేన,కూటమి నాయకులు ఇంటింటి వద్ద వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్రయ్య, ఇఒపిఆర్‌డి సురేష్ బాబు, పంచాయతీ సెక్రటరీ సురేష్ బాబు, టిడిపి శివరామ్ నాయుడు, మేకల మహబూబ్‌బాషా, ఆనంద రెడ్డి, జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ రెడ్డి

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడి కుటుంబానికి మంత్రి పరామర్శ


పెద్దనాగన్న కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-కలకడ

విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు నగిరి మడుగు పెద్ద నాగన్న మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. సంబేపల్లి మండలం ఎస్.సోమవారం పంచాయతీ మధిర అగ్రహారంలో నివాముున్న నగిరమడుగు పెద్ద నాగన్న ఈనెల 11న రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి ప్రయివేట్ వైద్య శాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి ఆయన గృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం దేవలంపేటలో విశ్రాంత పోస్ట్‌మ్యాన్ జబ్బార్ సాహెబ్ కుటుంబాన్ని దేవలంపేటలో మంత్రి పరామర్శించారు. టిడిపి కార్యకర్త కుమార్తెవివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నరసారెడ్డి, వేణుగోపాల్ ,రాహుల్ ,రాజశేఖర్ నాయుడు ,పజిల్, ఇర్ఫాన్‌బాషా, సుభాష్, సతీష్ కుమార్, సాయి పవన్ కుమార్, రఘునాథ, రవిచంద్ర ,శివ కుమార్ జాకీర్, దాను, బడాబచ్చా, సాయిపీర్, సుబ్బరాజు, శివారెడ్డి, మల్లికార్జున నాయుడు, వెంకటరమణ, పెద్దోడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ నీలకంఠేశ్వరావు తెలిపారు. మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఎస్‌జిఎఫ్ అండర్ -19 త్రోబాల్, వాలీబాల్, బాడ్మింటన్ జిల్లా ఎంపికలు మైదుకూరులోని మేధా జూనియర్ కళాశాలలో జరిగాయని అన్నారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రో బాల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని హర్షిత, పదవ తరగతి విద్యార్థి భరత్, వాలీబాల్‌లో మమత, బాల్ బ్యాట్మెంటన్ లో భరత్, అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యా ర్థులను ప్రిన్సిపల్ లీలా శ్రీహరి అభినందించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - దువ్వూరు

స్థానిక శ్రీమరకత వాసవి కన్యక పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆదివారం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ఆరవేటి సుబ్బారావు మాట్లాడుతూ అక్టోబర్ 3వ తేదీ నుంచి 13వరకు ఉత్సవాలు అమ్మవారికి ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 12న అమ్మవారికి గ్రామోత్సవం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు లింగం పట్టాభి రామయ్య, వైస్ ప్రెసిడెంట్ యాదల్ల రామకృష్ణ, సెక్రటరీ దేవతి రాము, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పంపిణీకి నోచని ప్లాస్టిక్ డబ్బాలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం : మండలంలో గత ప్రభు త్వ హయాంలో స్వచ్ఛభారత్ మిషన్ కింద ప్రభుత్వం గ్రీన్, ఎల్లో ప్లాస్టిక్ డబ్బాలను ఇంటింటికి పంపిణీ చేయా లని ఆదేశించింది. గత సార్వత్రిక ఎన్నికల సమయం ముందే వీటిని ఆయా పంచాయతీలకు సరఫరా చేసింది. ప్రతి ఇంటికి ఒకటి ఎల్లో, మరొకటి గ్రీన్ ప్లాస్టిక్ డబ్బాలు పంపిణీ చేసి వాటిలో తడిపొడి చెత్త వేసేలా ప్రజలకు అవగాహన కల్పించి ఇవ్వాల్సి ఉంది. అయితే చాలా పంచా యతీలలో కుటుంబాలకు సరి పడా ప్లాస్టిక్ డబ్బాలు ఇవ్వని కారణంగా పంపిణీ చేయలేదని పంచాయతీ కార్య దర్శులు చెబుతున్నారు. ఈ డబ్బాలు చాలా పంచాయతీ సచివాలయాల్లో అలం కారప్రాయంగా మిగిలాయి. అధికారులు చర్యలు తీసుకొని త్వరితగతిన పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ శాఖ ఎఇ బదిలీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం : సింహాద్రిపురం విద్యుత్ శాఖ ఎఇ సుబ్రమణ్యం రైల్వేకోడూరు టౌన్‌కు బదిలీ అయ్యారు. ఆ మేరకు ఆదివారం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సబ్ ఇంజనీర్ వినోద్‌ను కలసపాడుకు బదిలీ చేశారు. మండలానికి సంబంధించి ఎఇ, ఎస్ఇ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇన్‌ఛార్జిగా వేముల సబ్ ఇంజనీర్ దినేష్‌కుమార్‌కు అదనపు బాధ్యతలిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

రఘురామ కృష్ణంరాజు రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - చాపాడు : ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు వెంటనే రాజీనామా చేయాలని జిల్లా మాల మహానాడు యూత్ ప్రెసిడెంట్ తిట్ల చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రఘురామ కృష్ణం రాజు ఒక ప్రజా ప్రతినిధిగా సమాజంలో ఉండడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్నారు. ఆయన ప్రజాప్రతినిధి కావడానికి భారత రాజ్యాంగం ద్వారానే అయ్యాననే విషయాన్ని మర్చిపోయినట్లు ఉన్నారన్నారు. భారతదేశానికి ఒక దశ దిశను నిర్ణయించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని అక్కడ నుండి తొలగించడం వంచనకరమన్నారు. అక్కడ ఏదైనా పొరపాటు జరిగి ఉంటే దానికి ఒక చట్టం ఉంటుందని, ఆ ప్రకారం తొలగించాలన్నారు. తక్షణమే ఆయనను సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బండి పుల్లయ్య, భూమిరెడ్డి చిన్న మాధవయ్య పాల్గొన్నారు.

టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని టివి టెక్నీషియన్ల సమ స్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. ఆదివారం వైఎస్‌ఆర్ ప్రెస్ క్లబ్ లో కడప సిటీ టివి టెక్నీషియన్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ అండ్ టివి మెకానిక్స్ ట్రేడ్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ టెక్నీషియన్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తాను ఎప్పుడూ ముందుంటానని చెప్పారు. చంద్రన్న కానుక పథకంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అందరికీ ఇళ్లు, ఇళ్ళ స్థలాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి హరిక్రిష్ణ, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, సిటి ప్రెసిడెంట్ సలీం, జిల్లా కార్యదర్శి బహుద్దీన్ మాట్లాడుతూ ఎవరికీ ఏ సమస్య వచ్చినా ఆర్థికంగా ఆదుకుంటున్నామన్నారు. తాము స్కిల్ డెవలప్మెంట్ క్రింద ట్రైనింగ్ కోసం దరఖాస్తు చేశామని, అయితే అంతలో ఎన్నికల కోడ్ రావడంతో నిలిచి పోయిందని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. సమావేశంలో సిటి సెక్రటరీ మురళి,ట్రెజరర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పాటుపడాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రయివేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి అందరూ కలిసికట్టుగా పాటుపడాలని మైదుకూరు నియోజకవర్గం ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం నాయకులు బద్వేలి రామకృష్ణారెడ్డి కోరారు. మైదుకూరులోని శ్రీవాసవి హైస్కూల్‌లో ఆదివారం ప్రయివేట్ పాఠ శాలల యాజమాన్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని 24 మంది కరస్పాండెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రయివేటు పాఠ శాలలు నేడు వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నాయన్నారు. వాటిని ఎదు ర్కొనేందుకు సంఘటితం కావాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. **ఎన్నికైన కార్యవర్గం సభ్యులు..** గౌరవ అధ్యక్షులుగా డి.వేణుగోపాల్ రెడ్డి (శ్రీగాయత్రి హైస్కూల్), టి.వెంకటేశ్వర్లు (టీవీఎస్‌ఎం స్కూల్), పి.వసుంధర దేవి (శారదా స్కూల్), గౌరవ సలహాదారులుగా ఇవి రమణారెడ్డి (వరుణ్ హైస్కూల్), అధ్యక్షులుగా డాక్టర్ టి.సుధాకర్ రెడ్డి (రెయిన్‌బో స్కూల్), జనరల్ సెక్రెటరీగా బి.నాగేశ్వర్‌రెడ్డి (శ్రీ స్వామి వివేకానంద విద్యానికేతన్), ట్రెజరర్‌గా ఎ.ఆంజనేయులు (శివ చైతన్య హైస్కూల్), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా టి.సాయి ఓబుల్‌రెడ్డి (శ్రీసాయి స్కూల్), బి.రామకృష్ణారెడ్డి (వాసవి స్కూల్), ఉపాధ్యక్షులుగా ఎం. రామ్మోహన్‌రెడ్డి (శంకరాచార్య హైస్కూల్), ఎం.గురుస్వామి యాదవ్ (లిఖిత హైస్కూల్), ఉప కార్యదర్శులుగా ఎంఎస్ మహబూబ్ బాషా (సాయికృప స్కూల్), ఎస్.రాజేశ్వరి (సాయి తేజ హైస్కూల్)ని ఎన్నుకున్నారు. వీరు రెండేళ్లపాటు ఆ పదవిలో ఉంటారు.

తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని కేసాపురం గ్రామంలోని ముండ్లవారికోట గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో గ్రామస్తులు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ దృష్టి తీసుకపోయారు. ఆమె తక్షణమే స్పందించి అద్దె బోరును ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా బోరులోని నీరు ఇంకి పోవడంతో తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. తాగునీటి సమస్యను మంత్రి సతీమణి హరితమ్మ దృష్టికి తీసుక పోవడంతో తక్షణ పరిష్కారంగా అద్దె బోరును ఏర్పాటు చేయించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపించారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి- కడప అర్బన్ : కాకినాడలో రంగరాయ మెడికల్ కళాశాలలో స్పోర్ట్స్ వైస్ చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వర రావుపై దాడి చేసిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పైన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, బి.మనోహర్, జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రౌండ్‌లో వాలీబాల్ ఆడు కునేందుకు అనుమతి ఇవ్వలేదనే కారణంతో ఎమ్మెల్యే వారి అనుచరులు దుర్మా ర్గంగా దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ అను మతి తీసుకుంటే అభ్యంతరం లేదని తెలియజేసినా హెచ్‌ఒడిపై దాడి చేయడం దారుణమన్నారు. ప్రజా ప్రతినిధులుగా ఉండి ప్రత్యక్ష దాడికి పాల్పడం సరైంది కాదని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులే ప్రజల పైన, విద్యార్థుల పైన, ఉద్యోగులపైన దాడి చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

నంద్యాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా అలీఖాన్

ప్రజాశక్తి - కడప

నంద్యాల జిల్లా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌ఛార్జిగా పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్‌ను నియమించారు. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైయస్ షర్మిల ఆదివారం ఉత్త ర్వులు జారీ చేశారు. శనివారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో రాష్ట్రంలోని జిల్లా పార్టీ ఇన్‌ఛార్జిలతో ప్రత్యేకంగా పిసిసి చీఫ్ షర్మిల నేతృత్వంలో కీలక భేటీ నిర్వహించారు. ఇందులో భాగంగా మహమ్మద్ అలీఖాన్ ను నంద్యాల జిల్లా పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. తనకు పదవీని అప్పగించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

చోరీకి గురైన గృహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కృష్ణానగర్‌లో భారీ చోరీ

పోలీసు జాగిలంతో తనిఖీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక కృష్ణానగర్‌లోని ఓ ఇంటిలో భారీ చోరీ జరిగింది. పుల్లంపేట మండలంలోని కొత్తపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఇంద్రావతి, చిత్తూరు డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న నాగరాజు దంపతులు తమ కుమారుడితో కలిసి బెడ్ రూమ్ లో నిద్రిస్తుండగా శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని ఆగంతకుడు ఇంట్లోకి చొరబడి గదిలోని తాళాలు తీసి బీరువాలో ఉన్న 20 తులాలు బంగారు, రెండు లక్షలు నగదు అపహరించినట్లు బాధితులు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని పట్టణ సిఐ యల్లంరాజు, ఎస్ఐ లక్ష్మీప్రసాద్, రెడ్డిలోకేష్, ఎఎస్ఐ వర్మ, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసు జాగిలాన్ని రంగంలోకి దింపి ఆదివారం ఉదయం నుంచి దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మాత్రం హత్య చేశారని ఆరోపించారు. మదనపల్లె తాలూకా పోలీసుల కథనం మేరకు..మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీ, ఆచార్లపల్లెకు చెందిన వెంకటేష్ సుజాత దంపతుల కుమారుడు కప్పల జయపాల్(27)కు తల్లి రెండు రోజుల క్రితం రూ.10వేలు చేతికిచ్చి మదనపల్లెలోని కమ్మి వ్యాపారికి అప్పు చెల్లించి రావాలని చెప్పిందన్నారు. డబ్బు తీసుకుని మదనపల్లె చేరుకున్న జయపాల్ కొందరు యువకులతో కలిసి బసినికొండ లోని ముంబై-చెన్నై జాతీయ రహదారి వద్దకు వెళ్లాడని తెలి పారు.అక్కడ వారి మధ్య ఏమి జరిగిందో ఏమో నిమ్మనపల్లె రోడ్డు సర్కిల్లోని ఓ వ్యవసాయ బావిలో అనుమానాస్పదంగా మృతి చెంది శవమై కనిపించాడని తెలి పారు. ఆదివారం మృత దేహం నీళ్లలో తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబీకులు ఘటన స్థలం వద్దకు చేరుకొని బోరున విలపించారు. జయపాల్‌ను ఎవరో కొట్టి చంపి బావిలో పడేసి ఆత్మ హత్యగా చిత్రీ కరించారని ఆరోపించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ బోధనాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ములకల చెరువు ఎస్ఐ గాయత్రి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గంగిరెడ్డిపల్లెకు చెందిన చంద్రశేఖర్, బాబయ్యలు ఆదివారం ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయల్దేరారు. ఇదే సమయంలో కురబలకోట మండలం, తుంగావారి పల్లెకు చెందిన రైతులు ఎన్.లక్ష్మన్న, కె.లక్ష్మన్నలు ద్విచక్రవాహనంలో కదిరికి వెళుతున్నట్లు తెలిపారు. మార్గమధ్యంలోని పెద్దపాళెం గేటు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయని అన్నారు. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాల్లోని నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బాదితులను 108 సిబ్బంది మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరించినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురు కోడి పందెం రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - రామసముద్రం

కోడిపందెం స్థావరాలపై దాడులు చేసి ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట సుబ్బయ్య తెలిపారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని కురిజల పంచాయతి దొడ్డిపల్లి గ్రామ సమీపంలో కొందరు వ్యక్తులు కోడి పందెం అడుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కోడి పందెం స్థావరం దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకుని వారివద్ద నున్న రూ.5,800 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.మండలంలో పేకాట, కోడిపందెం, నాటుసారా విక్రయాలపై నిఘాఉంచామని తెలిపారు. ఎవరైన చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.